కథా నిలయం
3415
శ్రీకాకుళం

# జీవచ్ఛవాలు

టోర్పెడో వచ్చింది; వెళ్ళింది. అమెరికా నుంచి వచ్చింది, మలయా వెళ్ళింది, ఇంకా తిరిగి రాలేదు.

టోర్పెడో వచ్చిననాడు మా వాళ్లు కొంత మంది వుర్రూత లూగారు. 'కొత్త ఓడ – అందులోనూ అమెరికా నుంచి, పోర్టుహోల్సు లేవట! మన కళ్ళే పాపం చేసుకున్నాయా' అనుకుని బయలుదేరాం. రహస్య నిర్మాణం! అందుకనే మేం చూట్టానికి వీల్లేకపోయింది. అదంతా యెందుగ్గాని—

టోర్పెడో అన్నమాట తలుచుకుంటే నాకు వెంటనే గుర్తుకొచ్చేది 'డిక్'. "నా పేరు డిక్" అని చెప్పాడు ఆ మనిషి చ్యూయింగమ్ నమల్తూ.

వేసైడ్‌యిన్‌లో కలుసుకున్నాం అతన్ని. నేను మ్యూజియం వేపుకు చూస్తూ కూర్చున్నా. సుబ్రహ్మణ్యం "అడుగోరా అమెరికన్ సెయ్లర్!" అన్నాడు. వాడి ఎక్సైట్‌మెంట్ని చూచి నవ్వుకుంటూ వాడు చూచేవేపుకే నేనూ చూచా.

"హలో" అన్నాడు సెయ్లర్.

"హలో" అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఖాళీగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. 'డిక్'

కూర్చుంటూనే "బోయ్! మూడు వెర్మౌత్లూ, నాలుగు బీర్లూ" అన్నాడు.

సుబ్రహ్మణ్యం నా చంక పొడిచి "అదిరా అమెరికన్ తెగింపంటే! డబ్బంటే నీళ్ళతో సమానం వాళ్ళకి" అన్నాడు తెలుగులో. అవును బీరు నీరేగా!

కూర్చుంతర్వాత, తాగటం మొదలెట్టింతర్వాత మాట్లాడకుండా వుండటం సుబ్రహ్మణ్యానికి చేతగాదు.

"మీ 'స్వాతంత్ర్య దేవత'ని చూడాలనుందండీ" అన్నాడు. ఆ మాటలు సెయ్లర్ విన్నట్లు కన్పించలా.

"ఆవిడ ముఖంలో మాతృత్వం తొణికిసలాడుతూ౦దటగా?" అన్నాడు మళ్ళీ.

"ఎవరి ముఖంలో?" అన్నాడు సెయ్లర్.

"స్వాతంత్ర్య దేవత ముఖంలో!"

సెయ్లర్ ముందున్న గ్లాసు ఖాళీ అయింది.

"ఓ హ్హాదా! ఆగస్ట్ బార్థోల్డీ చేశాడు ఆ ప్రతిమని. అతను అమెరికను గాదు. ఫ్రెంచి మనిషి. అమెరికా ఎంతో గొప్పదనుకున్న ఫ్రెంచి మనిషి! తన సొంత తల్లినిచూచి చిత్రించాడు" నా కదంతా అయోమయం అనిపించింది.

"ఎక్కడుందండీ ఆ ప్రతిమ?" అన్నాను.

సుబ్రహ్మణ్యం సమాధానం చెప్పబోయాడు. సెయ్లర్ ఒక చేతితో వాడి నోరుమూసి, రెండో చేతితో బీర్ బోటిల్ మూతి తెరచాడు.

"న్యూయార్క్ బయట బెడ్లోల్ ద్వీపంమీద వుంది. న్యూయార్క్‌లో అడుగుపెట్టదలచుకున్న వాళ్ళకి ప్రథమంగా కన్పించేది ఆ ప్రతిమే."

"దివ్య మాతృ విగ్రహం!" అన్నాడు సుబ్రహ్మణ్యం సెయిలర్ ముందున్న గ్లాసులో బీరు బంగారంలా మెరుస్తోంది.

"ఆ విగ్రహం వీపు అమెరికావేపు చూస్తూంటుంది!" అని పకపకా నవ్వుకున్నాడు సెయ్లర్.

"మీ దేశంలో తల్లులందరి ముఖాల్లోనూ..." అంటున్నాడు సుబ్రహ్మణ్యం.

ఒక చేతితో మళ్ళీ సుబ్రహ్మణ్యం నోరు మూసి, రెండో చేతితో బీరు బుడ్డెత్తి ఖాళీ చేశాడు 'డిక్'. మా వాడు గుటకలు మింగాడు.

"తల్లులు! నాకు తల్లిప్రేమంటే యేమిటో తెలియదు. మా అమ్మ చచ్చిపోలేదు...నాకు మా అమ్మంటే ప్రేమ లేదు. పక్షిలా పెరిగాను. నేను డబ్బు సంపాయిస్తే గొప్పవాణ్ణట, లేకుంటే కొడుకునే కాదు. పొమ్మంది. డాలరు తెస్తే ముద్దు, తేకుంటే మొట్టు!"

"ఏమిట్రా యిట్లాగంటాడు?" అన్నాడు మా వాడు తెలుగులో.

గుక్క తిప్పుకుని "అయితే, మీ స్నేహితురాలంటే ప్రేమన్న మాట మీకు?" అని యికిలించాడు మా వాడు.

ఖాళీ గ్లాసువేపుకు చూశాడు డిక్. "వాళ్ళమాత్రం

యేం చేస్తారు? పాపం! వాళ్ళకీ డబ్బు కావాలి; సినిమాలు కావాలి; టాయ్లెట్స్ కావాలి, టాక్సీ కావాలి. అవన్నీ యిస్తే స్నేహితుణ్ణి ఇవ్వలేకపోతే — యివ్వగలిగినవాడు కావాలి... నాకు స్నేహితులూ లేరు; స్నేహితురాళ్ళూ లేరు. మా దేశంలో స్నేహం లేదు. ఉన్న స్నేహంలో లోతు లేదు. కావలసినంత వెడల్పు. మోకాళ్లుగూడా మునగని లోతు. కనుచూపుమేర దూరమంత వెడల్పు...అందరికీ అందరూ స్నేహితులే— యెవరికీ యెవరూ స్నేహితులు గాదు."

"ఒరేయ్! మైకం ఎక్కుతోందిరా" అన్నాడు మా వాడు తెలుగులో.

నాకేమీ తోచలేదు. "ఓడపనిలో ఎందుకు చేరారు?" అన్నా.

ఖాళీ గ్లాసు నింపాడు డిక్.

"నేవీలో చేరితే మలయా వెళ్ళాలిసొస్తుందని నాకూ తెలుసు. అందుకనే మొట్టమొదట వాళ్లు చేరమంటే చేరనన్నాను. వెధవ జానెడు పొట్ట నిండదటలే అని భరోసా పడ్డాను. మీ దేశంలో రెక్కలాడితే డొక్కాడుతుందో లేదో నాకు తెలియదు. మా దేశంలో ఒక్కటాడినంత మాత్రాన్నే రెండోదికూడా ఆడదు. రెక్కల్తోపాటు మెద డమ్ముకోవాలి, నవ్వే కళ్ళమ్ముకోవాలి, గుండ్రంగా పెంచుకుని అవయవాల నమ్ముకోవాలి; ఆహ్వానించే నవ్వు నమ్ముకోవాలి, ప్రేమ నమ్ముకోవాలి, ఆప్యాయా న్నమ్ముకోవాలి. ఇవన్నీ మగవాడిని నేనమ్ముకోవాలంటే మాత్రం కొనేవాళ్ళెవళ్లు?... నేను గూడా ఒక యంత్రాన్ని

కావాలి; యంత్రంలో బోల్టుని కావాలి! నా నాశనాన్ని నేనే అమ్ముకోవాలి!"

"ఇదేమిట్రా యిట్లా అంటాడు!" అన్నాడు మావాడు తెలుగులో. మా వాడింకా వెర్రాతే తాగుతున్నాడు. "మీది మహాగొప్పదేశం. ఎన్ని పరిశ్రమలు! ఎన్ని యంత్రాలు! ఆటంబాంబుని కనిపెట్టారే!" అని ఆకాశం వంక చూశాడు సుబ్రహ్మణ్యం. నిండిన గ్లాసుని సగం చేశాడు డిక్.

"ఎవరు చెప్పారు మీకు? ఇంతవరకూ మేం కనిపెట్టిన మూలసూత్రం ఒక్కటి చూపించు, ఎవడో తెలివిగలవాడు పుణ్యం కట్టుకోకుండా, మేం పాపం కట్టుకుంటున్నాం. మా రక్తంలో నేలేదు కనిపెట్టడం అనేది. మా కొక సామెతవుంది; 'వాడు చేసిందానికంటే బాగావుండే ఎలుకలబోను తయారు చేశావంటే లోకం నీ యింటికి రోడ్డేసుకుంటుంది' అని! ఎట్లా పుట్టావయ్యా నువ్వు!"

మా వాడు తొందరపడ్డాడు, తొందరపడ్డాడు. "తాగాడురా!" అన్నాడు యింగ్లీషులో. డిక్ విన్నాడో లేదో నాకు తెలియదు. సగం గ్లాసుచేసి మావాడి గ్లాసు నిండార్లు చేశాడు. మా వాడి ముఖం కళకళలాడింది. "మీ దేశం అంటే భక్తి లేనిదే మీరీ ఓడలోచేరి మీ దేశం కోసం పోట్లాడుతున్నారేం?" అన్నాడు.

"చూశావురా! చిత్తవుతాడు" అన్నాడు తెలుగులో.

సెయిలర్ కళ్లు నవ్వినయ్యి. రెండు చేతులతోనూ

ముందున్న గ్లాసు గట్టిగా పట్టుకున్నాడు. చితికి ముక్కలౌ తుందేమో అనుకొన్నా న్నేను. అది చితకనూ చితకలేదు, ముక్కలుగానూ లేదు. ఖాళీ అయ్యిందాకా డిక్ నోటికంటి పెట్టుకొని ఖాళీ బల్లమీద కూర్చుంది.

"నేనా చావడానికి చేరాను!" అన్నాడు డిక్. నేను మ్యూజియం బయట నిలబడ్డ చెట్లవంకా, చెట్ల వెనక చెట్ల తలల్ని తన్నే ఎర్రటి యిటుకల గోడలవంకా ఆ గోడల మధ్యలో వున్న మ్యూజియం వంకా చూస్తున్నా. అల వాళ్లైన వాళ్లు చెట్లనిగూడా మ్యూజియంగానే జమకడతారు. మా వాడు ఖాళీ అయిన వెర్మౌత్ గ్లాసులోకి చూస్తున్నాడు.

డిక్ అంటున్నాడు. "ఆఁ, నేను చచ్చేందుకు చేరాను. నేను బ్రతికేది చచ్చేందుకు. నేను బతుకుతూ చస్తూన్నాను. కొంతమంది బ్రతుకుతూ బ్రతుకుతున్నా మనుకుంటున్నారు. చావు దగ్గర పడుతోందని మర్చిపోతారు."

డిక్ చ్యూయింగం నములుతున్నాడు. మా దేశంలో వెధవ లున్నారు, డబ్బున్న వెధవలు! మేం డబ్బుకోసం చేరా మనుకుంటున్నారు వాళ్లు. వాళ్ళ డబ్బుతిని వాళ్ళని రక్షించ బోతున్నా మనుకుంటారు!...మమ్మల్ని మేమే భక్షించుకుం టున్నాం. భక్షణ! మేమంత తెలివితక్కువ వాళ్ళం గాదు!"

డిక్ కనుబొమలు ప్రశ్నార్థకాలైనాయి. పళ్లు కొరు క్కున్నాడు. చెవులు మెడవేపుకు లాక్కున్నాడు. ఒక పెనామా తీసి అంటించి పొగ వదలాడు. ఆ పొగ వెనుక మాట్లాడాడు:

"చేరకపోతే చచ్చిపోతా" నన్నారు వాళ్ళు. తిండి దొరక దన్నారు. సిగరెట్లు దొరక వన్నారు. బీరు దొరక దన్నారు. స్నేహితురాళ్ళు దొరక రన్నారు...అయితే చేరే చస్తానన్నాను. తిండి దొరికింది, సిగరెట్లు దొరికాయి, బీరు తాగినంత. మా ఓడ ఒడ్డు కొచ్చినప్పుడు కావలసినంతమంది స్నేహితురాళ్ళు......... ప్రపంచమంతా తిరిగాను. ఎంత మందినో ఆడవాళ్ళని చూచాను. కాని, జిబ్రాల్టరు ఆడవాళ్లా! అల్లాంటివాళ్ళని నేను కలలో గూడా చూడలేదు. అయితే వాళ్లు రాత్రంతా వుండేవాళ్ళు కాదు. తొమ్మిదిన్నరయ్యేప్పటికి సరిహద్దు దాటి స్పెయిన్లో కెళ్ళిపొయ్యేవాళ్లు."

"ఆత్మహత్య చేసుకోపొయ్యారూ?" అన్నాడు మా వాడు ఇంగ్లీషులోనే.

"అమ్మో! ఆత్మహత్యే?" అన్నాడు డిక్. నా కళ్ళ ముందు మ్యూజియం కదలినట్లయ్యింది. కుర్చీలో సర్దుకుని కూర్చున్నా.

"నీలాంటివాడే ఇంకో మాట అన్నాడు" అన్నాడు డిక్.

"నాలాంటివాళ్ళతో కలిసి-పుట్టబొయ్యేవాళ్ళు నాలా బ్రతక్కుండా వుండేందుకు-నేను చచ్చినా యిబ్బంది లేదట. 'పీటర్ చెయ్నీ' పుస్తకాలు చదవమన్నా వాడిని!" అంటూ ఆరిన సిగరెట్టపతల పారేశాడు.

"మా వాడిలాంటి వాడా!" అన్నా న్నేను.

"పీటర్చెయ్న్నీ ఎవ్వరు?" అని అడిగాడు మావాడు ఇంగ్లీషులో.

"పుస్తకాలు రాస్తాడు. ఆ పుస్తకాల్లో ఆడవాళ్ళ మడమల్ని గురించీ, చీలమండల్ని గురించీ రాస్తాడు. కథా నాయికలు హ్విస్కీ-లూ, సోడాలూ కలిపి తాగుతారు. కథా నాయకులు కనపడ్డవాళ్ళనల్లా లంకించుకుంటారు. ఆడదై పుట్టిన మనిషీ హత్యతో సంబంధం లేని మనిషీ లేదు. ఆలోచించ గూడదంటాడు చెయ్న్నీ. ఆలోచిస్తే అనుకున్నదికూడా వుండ కుండా పోతుందంటాడు. అన్నీ తెలిసిన మనిషికంటే ఏమీ తెలియని మొద్దు హాయిగా బ్రతుకుతుందంటాడు..."

"నేనెప్పుడూ వినలేదే అతని పేరు" అన్నాడు మా వాడు.

"అతని పుస్తకాలు మాకు ఫ్రీ సప్లయి చేస్తారు. అతను రాసిన పుస్తకాల్లో నేను చదవని పుస్తకం లేదు" అని రెండో సిగరెట్టంటించాడు సైలర్.

"ఓడలో వుంటే అతని పుస్తకాలు చదువుతా. బయ టికి వస్తే బజారుల్లో తిరుగుతా. నేను బజారుల్లో తిరిగేప్పుడు యెంత మంది ఇళ్ళల్లో వున్నారోనని ఆలోచించబోతా. ఎంత మంది పెళ్లాల మెడల్లో చేతులు వేసుకుని నిద్రపోతున్నారో ఆలోచిస్తా. ఎంతమంది చచ్చిపోతున్నారో ఆలోచిస్తా. నా ఆలోచన ఎంతకీ తెగదు. అప్పుడు యే 'బార్'లోనో దూరతా...

నాకు చావాలని బుద్ధిపుడుతుంది, చచ్చిపోలేను, ఎవ రైనా చంపుతారేమోననుకుంటూ. ఎవరైనా చంపితే బాగుం

టుంది కదా అనుకుంటూ. ఎవ్వరూ చంపరు. యుద్ధంలో చేరితే యెవళ్లో వాకళ్ళు చంపుతారు..."

మావాడు శూన్యంలోకి చూశాడు. నాకు క్రిందటి రాత్రి చూసిన న్యూస్రీల్ గుర్తుకొచ్చింది. జబ్బొచ్చిన పశు వుల్ని రెండు కొండల మధ్య కాల్చి చంపారు ఆ రీల్లో. నా వళ్ళు గగుర్పొడిచింది. 'ఛా' అనుకున్నా.

డిక్ వంక చూశా. రెండు చేతులూ డెస్కుమీద పరచుకుని, వాటి మధ్య తల ఇరికించుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. నా చేయి అప్రయత్నంగా అతని చేతిని నిమిరింది. డిక్ తల పైకెత్తాడు. నావంక దీనంగా చూశాడు.

"నాదొక్కటే కోరిక. ఎవరు చంపినా_నాకు బాధ కలక్కుండా, ఒక్క గుండుతోనే ప్రాణాలు పోయేట్టు చంపాల్నని. అదొక్కటే నేను కోరేది!"

"అదేమిట్రా, అట్లాగంటాడు?" అన్నాడు మావాడు తెలుగులో.

"అమెరికా మాట్లాడిస్తోందిరా" అన్నా న్నేను. ఎందుకన్నానా అని, మా వాడేమనుకున్నాడోనని తేరి పార చూశాను వాడి ముఖంలోకి.

"బి. సి. రాయ్ అమెరికా 'భూతల స్వర్గం' అన్నాడురా!" అన్నాడు మావాడు. ఆ ముక్క ఏ భాషలో అన్నాడో ఎంత ఆలోచించినా యిప్పటికీ గుర్తుకు రావటం లేదు.

ప్రక్కకి చూస్తే సెయర్ నీడలా నడచిపోతున్నాడు— మ్యూజియం చుట్టూ కప్పుకున్న చెట్ల చీకట్లల్లోకి.

"అదేరా వాళ్ళ ఓడకి దారి" అన్నాడు మా వాడు నాతో.

మర్నాడే టోర్పెడో మలయాకి లంగరెత్తింది. ఇప్పటికీ తిరిగి రాలేదు.

"మళ్లీ 'టోర్పెడో' ఎప్పుడొస్తుందోరా, వస్తుందంటావురా?" అంటాడు మావాడు యింకా అప్పుడప్పుడూ.

"ఎందుకురా?" అంటాన్నేను.

"ఆ 'మృతజీవి'ని చూడాలిరా!" అంటాడు మావాడు తెలుగులో.

—:o:—